# ‘కరువు పారిపోతే’ కరువు మండలాలు ఎలా ప్రకటించారు?

**రెయిన్‌గన్‌లతో** రాష్ట్రం నుండి కరువుని పారద్రోలానని, రాయలసీమలో పంటలు కాపాడానని ఆ ఘనత తనదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు సెప్టెంబర్ 10న ఘనంగా చెప్పుకొన్నారు!

అదే చంద్రబాబు ప్రభుత్వం అక్టోబర్ 21 రాత్రి సమయంలో హడావుడిగా కరువు మండలాలను ప్రకటించి ఆశ్చర్యపరిచింది. ఈ రెండు విరుద్ధ ప్రకటనలతో రాష్ట్రంలో అసలు కరువు ఎప్పుడు పోయిందో రైతాంగానికి అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

ఆగస్టు నెల చివరి వరకు రాష్ట్రంలో తీవ్ర దుర్భిక్షం నెలకొని ఉంది. లక్షలాది ఎకరాల్లో సేద్యం జరగలేదు. రాయలసీమలో 21.55 లక్షల ఎకరాల్లో వేసిన వేరుశనగ ఎండుముఖం పట్టి ఆగస్టు చివరినాటికి 17.53 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయింది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఎదపెట్టిన విత్తనాలు, నారుమళ్ళు పనికిరాకుండా పోయాయి. బోర్ల ద్వారా వేసిన పైర్లు నీరు అందక ఎండిపోయాయి. తూర్పు, పశ్చిమ గోదావరులు, విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో ఏర్పడిన కరువు, గ్రామీణ ప్రజలను అతలాకుతలం చేస్తుంటే, దాన్ని ఎదుర్కొనే చర్యలు తీసుకోకుండా చంద్రబాబు పుష్కరాల జపం చేయటంపై తీవ్ర విమర్శలు సాగాయి. దాన్ని ప్రక్కదారి పట్టించేందుకు రెయిన్‌గన్లను చంద్రబాబు ముందుకు తెచ్చాడు. వాటి ద్వారా పంటలు కాపాడతానని ఆచరణ సాధ్యంకాని మాటలు చెప్పాడు. ఈ మాటలు చెప్పిన సమయంలోనే అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్‌ల వలన విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణశాఖ చెప్పటంతోనే చంద్రబాబు రెయిన్‌గన్ల ఉద్దేశ్యం అర్థమౌతోంది. సెప్టెంబర్ 1 నుండి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలుపడ్డాయి. గుంటూరు జిల్లా, పల్నాడు, ఉభయగోదావరి జిల్లాల్లో వర్షంనీరు పొంగి 6 లక్షల ఎకరాలకు పైగా పంటలను ముంచింది. ఈ వర్షాల వలన కొన ఊపిరితో మిగిలి ఉన్న పైర్లకు ఊపిరి వచ్చింది. దీన్ని తన స్వార్థ రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకొన్నాడు. వర్షాలకు ఏమీ ప్రాముఖ్యత లేనట్లు, రెయిన్‌గన్ల వలనే పంటలను కాపాడినట్లు, వాటి ద్వారా కరువును పారద్రోలినట్లు విస్తృత ప్రచారం చేశాడు. (రెయిన్ గన్ల గురించి 20-9-16 ‘జనశక్తి’ చూడండి) ఇది పెద్ద జోక్‌గా మారింది.

సెప్టెంబర్‌లో వర్షాల వలన కొన్ని జిల్లాల్లో కొంతమేరకు పైర్లకు జీవంపోసినా మరోవైపు లక్షలాది ఎకరాల పైరు ముంపుకి గురైంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా నెల్లూరు, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. జూన్ నుండి అక్టోబర్ 15 తేదీ వరకు రాష్ట్రంలో 662.7 మిల్లీమీటర్లు నమోదుకావాల్సి ఉండగా 569.7 మి.మీ. నమోదైంది. అంటే 14 శాతం తక్కువ వర్షపాతంగా ఉంది. ఈ కాలంలో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో నమోదు అయిన వర్షపాతం అందుకు నిదర్శనంగా ఉంది.

వివిధ జిల్లాల్లో నమోదైన వర్షపాతాన్ని గమనిస్తే (పట్టిక చూడండి) మూడు జిల్లాల్లో సాధారణంకంటే కొంచెం ఎక్కువగాను, ఆరు జిల్లాల్లో సాధారణం కంటే కొంత తక్కువగాను, నాలుగు జిల్లాల్లో తక్కువ, అతి తక్కువగాను వర్షపాతం నమోదైంది. సెప్టెంబరులో కురిసిన వర్షం కురవాల్సిన మొత్తం వర్షపాతంలో నమోదుకావటం వలన కరువు ప్రకటన నిబంధనల ప్రకారం సాధారణం కంటే తక్కువగా వున్నా శ్రీకాకుళం, ఉభయగోదావరులు, గుంటూరు, కృష్ణా, కడప, కర్నూలు జిల్లాలు సాధారణ వర్షపాతం జిల్లాలుగా పరిగణించబడుతున్నాయి.

**రాష్ట్రంలో జూన్ నుండి అక్టోబర్ 15 వరకు కురిసిన వర్షపాతం**

| జిల్లా | కురవాల్సిన వర్షం | కురిసిన వర్షపాతం | వ్యత్యాసం శాతం | స్థాయి |
|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 846.5 | 699.1 | -17.4 | సాధారణం |
| విజయనగరం | 881.5 | 881.7 | 07.1 | సాధారణం |
| విశాఖపట్నం | 862.4 | 923.2 | 07.1 | సాధారణం |
| తూర్పు గోదావరి | 909.8 | 841.7 | -07.5 | సాధారణం |
| పశ్చిమ గోదావరి | 905.4 | 825.6 | -8.8 | సాధారణం |
| కృష్ణా | 790.6 | 741.0 | -6.3 | సాధారణం |
| గుంటూరు | 611.8 | 710.1 | 16.1 | సాధారణం |
| ప్రకాశం | 505.4 | 355.0 | -29.8 | తక్కువ |
| నెల్లూరు | 425.7 | 171.9 | -59.6 | మరీ తక్కువ |
| చిత్తూరు | 518.6 | 366.1 | -29.4 | మరీ తక్కువ |
| కడప | 464.7 | 395.3 | -14.9 | సాధారణం |
| అనంతపురం | 406.8 | 264.4 | -35.0 | మరీ తక్కువ |
| కర్నూలు | 543.3 | 475.6 | -12.5 | సాధారణం |
| **మొత్తం రాష్ట్రం** | **662.7** | **569.7** | **-14.0** | **సాధారణం** |

ఆధారం : 16-10-16 ‘విశాలాంధ్ర’

ఒక ప్రాంతాన్ని, మండలాన్ని, రాష్ట్రాన్ని కరువు మండలంగా ప్రకటించాలంటే వర్షపాతం లోటు 19 శాతానికి తక్కువకాకుండా ఉండాలి. అందుకు తగ్గితే నిబంధనల ప్రకారం కరువు ప్రాంతంగా ప్రకటించటానికి వీలుపడదు. రాష్ట్రంలో 14 శాతం తక్కువ వర్షపాతం నమోదు అయ్యింది కాబట్టి రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించలేదు. కొన్ని జిల్లాల్లో మండలాలవారీగా కరువును ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిబంధనలు లోపభూయిష్టమైనవి. నెలల తరబడి వర్షాలు కురవకుండా దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడి, ఆ తర్వాత రెండు, నాలుగు రోజులు విస్తృతంగా వర్షాలు కురిస్తే, ఆ వర్షపాతాన్ని కురవాల్సిన వర్షపాతంలో నమోదుచేసి, అంతకుముందు దాకా ఉన్న దుర్భిక్ష ప్రాంతాన్ని, దుర్భిక్షరహిత ప్రాంతంగా చెప్పటమే హాస్యాస్పదమైన విషయం. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ప్రస్తుతం నమోదైన వర్షపాతం ఆవిధంగానే ఉంది. దానికి అనుగుణంగానే ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించటం వలన అనేక మండలాలు కరువు మండలాల జాబితా నుండి తొలగించబడ్డాయి.

వర్షపాతం గణాంకాల ప్రకారం సెప్టెంబరు ఆఖరునాటికి రాష్ట్రంలోని 500 మండలాల్లో దుర్భిక్షం నెలకొని వుంది. ఆ నెల రెండవ వారంలో కురిసిన వర్షాల వలన వ్యవసాయ తరుణం దాటిపోవటంతో సేద్యం జరగలేదు. సెప్టెంబర్ రెండవ పక్షంలో భారీవర్షాలు, వరదల వలన అది సాధారణ వర్షపాతంలో చేరి దుర్భిక్ష మండలాల సంఖ్యను 300లకు తగ్గించింది. అప్పటికే కరువు నుంచి తగ్గించిన మండలాల్లో జరగాల్సిన పంటనష్టం జరిగింది. వాటిని కూడా కరువు మండలాలుగానే పరిగణించాల్సి ఉన్నా ప్రభుత్వం అలా చేయలేదు. సెప్టెంబరు రెండవ వారానికి ముందున్న వర్షపాతం, ఎండిన పంటలు (డ్రైస్పెల్-ఒక వర్షానికి మరొక వర్షానికి మధ్య 21 రోజులుదాటటం) లెక్కవేసి కరువు మండలాలను ప్రకటించాల్సి ఉంది. దీన్ని ప్రభుత్వం పాటించలేదు. చివరికి 245 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది.

గత రెండు సంవత్సరాలుగా కరువు మండలాలను ప్రకటించటంలోనూ చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసింది. నివేదికలు కేంద్రానికి పంపటంలోనూ నెలల తరబడి జాప్యం చేసింది. ఈ సంవత్సరంలో కూడా అదే జరిగింది. జులై నుండి సెప్టెంబర్ మొదటివారందాకా రాష్ట్రం తీవ్ర దుర్భిక్షంలో ఉన్నా కరువు ప్రాంతాలను ప్రకటించలేదు. కరువు లేదన్నట్లు చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించింది. ఫలితంగా కేంద్రం రాష్ట్రంలో కరువు లేదన్నట్లు వ్యవహరించింది.

కరువును పారద్రోలినట్లు తాను చేసిన వ్యాఖ్యలు అపహాస్యం కావటం, అనేక జిల్లాల నుండి వెల్లువలా కరువు వార్తలు రావటంతో కరువుని కప్పిపెట్టటం సాధ్యంకాక కరువు మండలాలను ప్రకటించక తప్పలేదు. రెయిన్‌గన్‌లు, పట్టిసీమ ద్వారా సాగునీరు అందించి సేద్యం సజావుగా పూర్తిఅయ్యేటట్లు ప్రచార బూటకత్వం బయటపడకుండా ఉండేందుకే చంద్రబాబు కరువు మండలాలను అక్టోబరు 21 వరకు ప్రకటించలేదు. రాష్ట్రంలో 400 మండలాలు కరువుబారినపడి సతమత మౌతున్నాయని అందులో 72 మండలాలు తీవ్ర వర్షాభావం, 27 మండలాల్లో పెను కరువు నెలకొని ఉందని వ్యవసాయశాఖ అధ్యయన నివేదికలు తెలుపుతున్నా, 245 మండలాలనే ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. ఇందుకు కారణం రైతాంగానికి ఇన్‌పుట్ ఇవ్వాల్సి వస్తుందనే.

కరువు కోరల్లో చిక్కుకున్న గ్రామీణ పేదలను, రైతాంగాన్ని ఆదుకొనటంలో పాలక ప్రభుత్వం ఏదైనా సహాయకచర్యల్లో ఇష్టపూర్వక విఫలతను ప్రదర్శించాయి. 2014-15 సంవత్సరంలో 225, 2015-16 సంవత్సరంలో 359 మండలాలను కరువు మండలాలుగా చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. గత మూడు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం 3 వేల కోట్ల రూపాయలదాకా నష్టం వాటిల్లింది. హుదూద్ తుఫాన్ వల్ల 1000 కోట్లు నష్టం జరిగింది. ఇంత నష్టం జరిగినా రాష్ట్ర ఖజానా నుండి చంద్రబాబు సహాయంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. కేంద్రం యిస్తేనే సహాయకచర్యలు అన్నట్లు వ్యవహరించాడు. కేంద్ర బృందాలు రావటం, పరిశీలించటం ఆలస్యం కావటమే కాకుండా, సహాయం ప్రకటించటంలోను కేంద్రం జాప్యం చేసింది. ప్రకటించిన సహాయం నామమాత్రమైనా అదీ పూర్తిగా విడుదల చేయలేదు. విడుదల చేసిందీ సహాయకచర్యలకు చంద్రబాబు ఖర్చు చేయలేదు. వేలకోట్లు నష్టం జరిగితే 2015-16 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 434 కోట్లు, 14వ ఫైనాన్స్ కమీషన్ 440 కోట్లు రాష్ట్రానికి సహాయంగా ప్రకటించింది. దీన్లో కూడా రైతులకు ఇన్‌పుట్ పంపిణీ జరగలేదు. దానికోసం రైతాంగం ఆందోళనలు చేస్తూనే ఉన్నారు.

ఈ సంవత్సరం ఏర్పడిన కరువు వలన రాష్ట్రంలో తీవ్ర నష్టం జరిగింది. ఒక్క వేరుశనగ రైతులే 7 వేలకోట్లు నష్టపోయారు. మిర్చి, పత్తి, వరిపై వేలాదికోట్ల నష్టం జరిగింది. సెప్టెంబర్‌లో వచ్చిన భారీవర్షాల ముంపు వలన పంటలకు అపార నష్టం జరిగింది. ఉపాధి లేక గ్రామీణ పేదల వలసలు ఎక్కువయ్యాయి. పశుగ్రాసం, మంచినీటి సమస్య తీవ్రమైంది. పశుపోషణ భారమై వాటిని కబేళాలకు తరలిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కరువు పీడిత ప్రజలను ఆదుకొనే చర్యలు ప్రభుత్వం ఇంతవరకు తీసుకోలేదు. ప్రజలు దుర్భరపరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కనీసం కరువు మండలాల నివేదికను కేంద్రానికి పంపి సహాయం కూడా కోరలేదు.

కరువు పరిస్థితుల ఎడల ప్రభుత్వ విధానాన్ని నిరశిస్తూ, పంటలు కోల్పోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని, గ్రామీణ పేదలకు ఉపాధి పనులతోపాటు రెండు నెలలకు సరిపోను నిత్య జీవితావసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలని, పశు గ్రాసం సప్లయ్ చేయాలనీ, నిత్యజీవితావసర వస్తువులను చౌకడిపోల ద్వారా అందించాలనీ, పేద, మధ్యతరగతి రైతుల బ్యాంక్ అప్పులు రద్దుచేయాలని, స్వల్పకాలిక పంట విత్తనాలు అందించాలనీ, రిజర్వాయర్ల, ప్రాజెక్టుల నీటిని సాగుకి ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామీణ పేదలు, రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలి.

oooooo